క్లుప్తంగా

చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆమె మండలంలోని కొండాపూర్‌కు చెందిన జగపతి తుల్జారాంపేటకు చెందిన శివ రాములు, ఖాజీపేటకు చెందిన వందన, రాం చంద్రాపూర్‌కు చెందిన రాజుగౌడ్, నర్సాపూర్‌కు చెందిన అక్బర్‌హుస్సేన్, ఎండీ మున్నాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని నాల్గవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ నిధుల నుంచి రూ.14లక్షలతో రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. నిధులున్నంత మేరకు పట్టణంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ఆయన వెంట కౌన్సిలర్ యాదగిరి తదితరులు ఉన్నారు.

యువత క్రీడలవైపు రావాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న మైనంపల్లి

మనోహరాబాద్(తూప్రాన్): యువత క్రీడల వైపు మొగ్గు చూపాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు, ఆటపాటలపై దృష్టి సారించేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు కెప్టెన్ కార్తీక, శ్రీకృతి, గీతిక, నిశాంత్‌లు ఇటీవలే కాశ్మీర్‌లో జరిగిన జాతీయ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున కప్ గెలుపులో కీలకంగా రాణించారు. ఈ సందర్భంగా వారిని హైదరాబాద్‌లోని తన నివాసంలో సన్మానించారు. క్రీడలకు అండగా ఉంటానని వారి హామీనిచ్చారు. అంతే కాకుండా క్రీడలవైపు తమ అమ్మాయిలను ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, కుమార్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాజు, వెంకట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లాలో ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అతన్ని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్‌ముదిరాజ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తూనే సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్షయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు రామకిష్టయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి, భవాని, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రజక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తొగుట(దుబ్బాక): జనగామలో నిర్వహించనున్న రజక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేశ్ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన పోస్టర్‌లను శుక్రవారం తొగుటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు చట్టసభలతో పాటు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరుణాకర్, నర్సింహులు, సత్తయ్య, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగొట్టిముక్ల – జీడిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు పలుచోట్ల ఇరువైపుల పిచ్చిమొక్కలు కమ్మేశాయి. దీంతో వాహనదారులు రోడ్డు కనపడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నా.. వారు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గోమారం నుంచి సికింద్లాపూర్ సబ్‌స్టేషన్ వరకు ప్రమాదభరితంగా రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కల గురించి ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా, వాటిని తొలగించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

కనిపించని రోడ్డు, చెరువు



చెట్లు, పొదలతో అల్లాదుర్గం, అప్పాజీపల్లి వెళ్లే రోడ్డు

అల్లాదుర్గం(మెదక్): చెరువు కట్టపై భారీగా పొదలు, చెట్లు పెరగడంతో చెరువు కట్టతో పాటు రోడ్డు సహితం కనిపించడం లేదు. చెరువు కట్టపై, కింద రోడ్డు పక్కన పొదలతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లాదుర్గం పటేల్ చెరువు కట్టపై కట్ట కనిపించకుండా చెట్లు పెరిగాయి. చెరువు కట్టపై నుంచి రైతులు, ప్రజలు నడవలేని పరిస్థితి. చెరువు కట్టపై పొలాలకు వెళ్లాలంటే పొదల్లో ఏ జంతువు ఉందో తెలియడం లేదని, ఎదురుగా వచ్చే వాహనం తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు చెరువు కట్టపై, రోడ్డు పక్కన ఉన్న పొదలు, చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ముసాపేటలో సర్వే చేస్తున్న గ్రామకార్యదర్శులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శుక్రవారం గ్రామ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తూ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్వేను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తు సిబ్బందికి పలు సూచనలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



మందులు అందిస్తున్న సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. లలిత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, 65 మందికి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు కల్యాణ్, జోత్స్న, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నర్సింలు, నాయకులు సూర్యప్రకాశ్, నాగరాజు, పోచయ్య, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి కసరత్తు



ఉపాధిహామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ కోసం మస్టర్లు సిద్ధం చేస్తున్న ఏపీఓ పుణ్యదాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమానికి కసరత్తు చేస్తున్నట్లు ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్ శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏప్రిల్1, 2023 నుంచి మార్చి31, 2024 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. ఇందులో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడాది కాలంలో సీసీరోడ్లు, కిచన్‌షెడ్స్, మురికి కాల్వల నిర్మాణం, పూడికతీత, మట్టిరోడ్లు, వన నర్సరీలు, మొక్కలు నాటడం తదితర పనులకు సంబంధించి రూ. 9కోట్ల ఖర్చు చేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించి గ్రామాల వారీగా పత్రాలను సామాజిక తనిఖీ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు. సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, వీఎస్ఓలు తనిఖీ చేయనున్నట్లు చెప్పారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కల్యాణి



గజ్వేల్‌రూరల్: ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గజ్వేల్ మండలం కొడకండ్లకు చెందిన పుల్ల కల్యాణి రెండోసారి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏబీవీపీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్రశాఖకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన

గజ్వేల్‌రూరల్: మహిళలు, యువత, స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సిద్దిపేట యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధి మహ్మద్ నాజీమ్ సూచించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ ఆర్ కాలనీలోగల వేములఘట్‌లో స్వయం ఉపాధి శిక్షణపై శుక్రవారం మహిళలు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40ఏళ్ల మధ్య వయసు కలిగిన పురుషులు, మహిళలకు వివిధరంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత యూనిఫాం, కోర్సు మెటీరియల్‌తో పాటు టీ, భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తో పాటు అర్హులైన వారికి బ్యాంకు రుణాలు అందజేస్తామని, ఆసక్తికల వారు సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలను పరిష్కరించాలి



మనోహరాబాద్‌లో సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు టోకెన్ గ్రామ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో టోకెన్ సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతీ నెల వేతనాలు చెల్లించాలన్నారు. అప్పటి వరకు తమ విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక మండల అధ్యక్షులు వీరేశ్, శ్రీకాంత్, మహేశ్, సత్యనారాయణ, రమేశ్, సురేశ్, అర్జున్, భిక్షపతి తదితరులున్నారు.

వర్గల్ క్షేత్రంలో శనిత్రయోదశి మహోత్సవం

- నేడు ఉదయం నుంచే అభిషేకాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు



వర్గల్ క్షేత్రంలో శనేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలోనే సుప్రసిద్ధమైన వర్గల్ క్షేత్రంలోని శనేశ్వరాలయం శనిత్రయోదశి మహోత్సవాలకు సిద్ధమైంది. శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శనితైలాభిషేకాల కోసం తరలిరానున్నారు. శనివారం, త్రయోదశి రెండు కలిసివచ్చే అరుదైన రోజున శనేశ్వరునికి తిల, తైలాభిషేకం నిర్వహిస్తే దోషాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పర్వదినం సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి శుక్రవార ంతెలిపారు. వర్గల్ క్షేత్రానికి సికింద్రాబాద్ గురుద్వారా బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందని చెప్పారు.

తెల్లవారుజాము నుంచే..

తెల్లవారుజాము 5.30ని.లకు గణపతిపూజ, శనేశ్వర మూలమంత్ర జపం, తర్పణం, హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజంతా సామూహిక తైలాభిషేకాలు కొనసాగుతాయి. ఈ అభిషేకాలలో పాల్గొనడానికి భక్తులు రూ.250 చెల్లించవలసి ఉంటుంది. పూజా సామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

వాహనాలకు నిప్పు పెట్టిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ వాహనాలకు నిప్పుపెట్టి దహనం చేసిన వారిని వెంటనే గుర్తించి శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసులను ఆదేశించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల గోల్కొండ మోడల్ స్కూల్‌కు చెందిన రెండు వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన విషయం తెలుసుకొని ఆయన ట్రిస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రిన్సిపాల్ రవిని పరామర్శించారు. ట్రిస్మా తరఫున స్కూల్‌కు రూ.1,05,000 సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అండగా ఉంటామని ప్రిన్సిపాల్ రవికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ట్రిస్మా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కుంట రాజు, జిల్లా నాయకుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థిక సహాయం' అమలు ఎప్పుడు?

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్
- చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): భూమిలేని ఉపాధి హామీ రైతుకూలీలకు యేడాదికి రూ.12వేల ఆర్థిక సహాయ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పథకాన్ని వేగవంతంగా అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించినప్పటికీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సైకిలాబ్, కొండల్, నాగయ్య, వెంకట్రాములు, కిరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనిల్‌కుమార్



నారాయణఖేడ్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఖేడ్‌కు చెందిన అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో నిర్వహించిన సంఘం రాష్ట్ర 43వ మహాసభల్లో భాగంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ విద్యార్థులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కార్గో సేవల తనిఖీ



తనిఖీ చేస్తున్న మహ్మదొద్దీన్ ఇసాక్

నారాయణఖేడ్: కార్గో పార్శిల్ సేవలను శుక్రవారం ఆర్టీసీ జిల్లా కార్గో లాజిస్టిక్ ఏటీఎం మహ్మదొద్దీన్ ఇసాక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కార్గో పార్శిళ్లను పరిశీలించారు. స్థానిక కార్గో ఇన్‌చార్జి సంతోష్‌కుమార్‌ను అడిగి కార్గో పార్శిళ్లు, డెలివరీ వివరాలు తెలుసుకున్నారు. ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కార్గో సేవల కోసం కార్యాలయంలో బుక్ చేయవచ్చని తెలిపారు.

ఘనంగా సామూహిక జపం



జపంలో పాల్గొన్న భక్తులు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ అనంత మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం శ్రీమాత్రే నమః సామూహిక జపం ఘనంగా జరిగింది. మాధవనంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో గోధుమ గింజలతో జపం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

జాగిలాలతో తనిఖీలు



కిరాణా దుకాణంలో తనిఖీ..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో భూంపల్లి పోలీసులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణకు జాగిలాలతో వివిధ కిరాణా షాపులు, పాన్ షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో మత్తు పదార్థాలను చాక్లెట్ రూపంలో అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్‌లను విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో భూంపల్లి పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటానికి ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని, ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు.



నర్సాపూర్: మాజీ ప్రధాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



తూప్రాన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చేగుంటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మెదక్‌జోన్: పట్టణంలో..



పాపన్నపేటలో..



రేగోడ్‌లో..



టేక్మాల్‌లో..



అల్లాదుర్గంలో ..



శివ్వంపేటలో..